సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 18 । మే । 2024



జనం చెంతకే..

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను ప్రజల చెంతకు చేర్చేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కృషి చేస్తోంది.

10లో ▸



బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

10లో ▸



మోస్తరు వర్షం

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

10లో ▸

మినరల్ కాదు.. అంతా జనరలే!

- పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు
- కొరవడిన అజమాయిషీ
- అధిక శాతం ప్లాంట్లలో కానరాని యూవీ సిస్టమ్
- యథేచ్ఛగా మినరల్ నీటి వ్యాపారం
- జిల్లాలో 600కు పైగా ప్లాంట్లు
- రోజుకు రూ.80 లక్షలకు పైగా అమ్మకాలు

సాక్షి, భీమవరం: ఐఎస్ఐ సర్టిఫికెట్ కలిగిన రివర్స్ ఆస్మోసిస్ (ఆర్ఓ) ప్లాంటు పెట్టాలంటే వివిధ శాఖల నుంచి పదికి పైనే లైసెన్సులు పొందాలి. ల్యాబ్, ప్లాంట్ సామగ్రి, అనుమతులు తదితర వాటికి రూ.35 లక్షలకు పైనే ఖర్చవుతుంది. జిల్లాలో ఈ తరహా ఆర్ఓ ప్లాంట్లను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. అయితే రెండు, మూడు లక్షల పెట్టుబడితో పెట్టిన ప్లాంట్లను ఐఎస్ఐ పేరిట వ్యాపారులు చలామణి చేసేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నాణ్యత లేని నీటిని విక్రయిస్తూ ప్రజారోగ్యంతో ఆటలాడుతున్నారు.

పెరుగుతున్న వాడకం : మినరల్ వాటర్ తాగే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నీటి విక్రయాలు మూడు టిన్నులు, ఆరు బాటిళ్లలా సాగిపోతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకుని జిల్లావ్యాప్తంగా రివర్స్ ఆస్మోసిస్ (ఆర్ఓ) ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్లాంట్ పెట్టాలంటే వివిధ శాఖల నుంచి గ్రౌండ్ వాటర్, ఫుడ్, జీఎస్టీ, లేబర్, ఐఎస్ఐ, నో అబ్జక్షన్, కమర్షియల్ తదితర పది వరకు లైసెన్సులు ఉండాలి. ఆయా లైసెన్సుల కోసం రూ.2 లక్షలకు పైనే ఖర్చవుతుంది. అయితే కేవలం స్థానిక సంస్థల నుంచి అనుమతి పొందడం ద్వారా తక్కువ పెట్టుబడితో అవసరమైన సామగ్రితో ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నారు. ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు గతంలో ప్రభుత్వం పలు మినహాయింపులు ఇచ్చేది. స్వచ్ఛంద సంస్థల మాటున వ్యాపారులు ప్లాంట్లు ఏర్పాటు చేసి ఐఎస్ఐ సర్టిఫికెట్ ఉన్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారు. గ్రామాల్లో రెండు, మూడు ఆర్ఓ ప్లాంట్లు ఉండగా, పట్టణాల్లో పదుల సంఖ్యలో ఉంటున్నాయి. జిల్లావ్యాప్తంగా 600లకు పైనే ఉన్నట్టు అంచనా. కాగా ఐఎస్ఐ సర్టిఫికెట్ కలిగినవి జిల్లాలో కేవలం నాలుగు మాత్రమే ఉండటం గమనార్హం. వీటిలో ఒకటి భీమవరం ఉండి రోడ్డులో ఉండగా, మిగిలినవి తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో ఉన్నాయి. వీరు మాత్రమే వాటర్‌ను బాట్లింగ్ చేయాల్సి ఉంది. కాగా కొందరు వ్యాపారులు తమ ప్లాంట్లకు ఐఎస్ఐ సర్టిఫికెట్ ఉన్నట్టుగా ప్రచారం చేసుకుంటూ కనీస ప్రమాణాలు పాటించకుండా బాట్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

హానికరంగా వాటర్ ప్యాకెట్లు : 120 మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్లలో మాత్రమే మినరల్ వాటర్ ప్యాకింగ్ చేయాలన్న నిబంధనలు సక్రమంగా అమలుకావడం లేదు. తక్కువ ధరకు వస్తున్నాయన్న ఉద్దేశంతో నిర్ణీత మందం కన్నా పల్చటి కవర్లు వినియోగిస్తున్నారు. దీనివలన పర్యావరణానికి హాని కలగడంతో పాటు ఎండ తీవ్రతకు కవర్‌లోని నీరు వేడెక్కి కవర్‌లోని కెమికల్స్ నీటిలోకి చేరడం వలన ప్రజారోగ్యానికి హాని కలుగుతుంది.



భారీగా వ్యాపారం.. శాంపిల్స్ కూడా సేకరించని వైనం

గ్రామీణ ప్రాంతాల్లో 20 లీటర్లు రూ.5 నుంచి **రూ.10ల వరకు, కూలింగ్ వాటర్‌ను** రూ.30 **చొప్పున విక్రయిస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో ఈ ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నా**యి. ఇళ్లకు **చేరవేస్తే రవాణా చార్జీలు అదనం.** ప్లాంట్లలో **నీటిని వాటర్ ప్యాకెట్లుగా, బాటిళ్లుగా** ప్యాకింగ్ చేసి పాన్‌షాపుల ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. ఎండల తీవ్రతకు తోడు ఎన్నికల సీజన్ రావడంతో ఈ వేసవిలో భారీస్థాయిలోనే వ్యాపారం జరిగినట్టు తెలుస్తోంది. జిల్లాలో రోజుకు దాదాపు రూ.80 లక్షలకు పైగా నీటి వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా. భారీ ఎత్తున జిల్లాలో మినరల్ నీటి అమ్మకాలు జరుగుతున్నా నీటి నాణ్యతను పరిశీలించే దిశగా స్థానిక సంస్థలు కనీసం శాంపిల్స్ కూడా సేకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

నాణ్యత ఎంత?

ఆర్ఓ ప్లాంటు నీటిలోని మలినాలను శుద్ధి చేస్తే, అల్ట్రా వైలెట్ సిస్టమ్ (యూవీ) బ్యాక్టీరియాను తొలగిస్తుంది. బాట్లింగ్, వాటర్ ప్యాకెట్ల రూపంలో రోజుల తరబడి నీటిని నిల్వ ఉంచాల్సి వస్తే వైరస్ చేరకుండా ఓజేనేషన్ సిస్టమ్ వాడతారు. ఐఎస్ఐ ధ్రువీకరణ కలిగిన మినరల్ వాటర్ ప్లాంట్లలో ఓజేనేషన్ సిస్టమ్ తప్పనిసరి. అధిక శాతం ప్లాంట్లలో కేవలం ఆర్ఓ టెక్నాలజీ ద్వారా నీటిలోని మలినాలను మాత్రమే శుద్ధి చేస్తున్నారు. ఓజేనేషన్ సిస్టమ్ మాట అటుంచితే కొన్నిచోట్ల బ్యాక్టీరియాను శుద్ధి చేసే యూవీ సిస్టమ్ ఉండటం లేదని తెలుస్తోంది. రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టి దీనిని ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. క్రమం తప్పకుండా ఫిల్టర్లు శుభ్రం చేయడం, ఆర్ఓ ప్లాంటుకు ఆయువుపట్టులాంటి మెమరిన్ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించడం వంటి చర్యలు చాలాచోట్ల కనిపించడం లేదు. నీటిలోని రంగు, ఐరెన్, హార్డ్‌నెస్, కాల్షియం, ఫ్లోరైడ్, మెగ్నీషియం, సల్ఫేట్ తదితర వాటి శాతం పరీక్షించేందుకు ప్రతినెలా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా చాలా మంది వ్యాపారులు చేయడం లేదు. బోరు నీటిలోని టోటల్ డిజాల్వడ్ సాలిడ్స్ (టీడీఎస్) 2000 శాతం వరకు ఉంటుంది. ఆర్ఓ ప్లాంటు నుంచి బయటకు వచ్చేసరికి 20 నుంచి 30 మధ్య టీడీఎస్ శాతం ఉండాల్సి ఉండగా చాలా ప్లాంట్లలో పరిమితికి మించి ఉంటున్నట్టు తెలుస్తోంది. ప్రజారోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులు స్పందించి సురక్షితమైన నీటిని అందించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

సాధారణ విధులపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ సత్యనారాయణ

నరసాపురం: ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో సాధారణ విధులపై ఉద్యోగులు దృష్టి పెట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ కె.సత్యనారాయణ సూచించారు. శుక్రవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. అనంతరం మున్సిపల్, వార్డు సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో వార్డుల్లో మంచినీటి సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని, డ్రెయినేజీ శుభ్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలు, సమస్యలు తీర్చేలా పనిచేయాలన్నారు. ఉద్యోగుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న డీఆర్ఎంఏను కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మున్సిపల్ అధికారులు సత్కరించారు. ఆర్ఐ నానాజీ, డీఈ రమేష్ బాబు, టీపీఓ శేషగిరి పాల్గొన్నారు.

రక్తపోటుపై అప్రమత్తం



గొల్లవానితిప్పలో ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ మహేశ్వరరావు

భీమవరం అర్బన్: రక్తపోటు (హైబీపీ)పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లవానితిప్పలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా 30 ఏళ్లు పైబడిన వారికి హైబీపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మహేశ్వరరావు మాట్లాడుతూ ఒత్తిళ్లు, శారీరక వ్యాయామం, జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు తదితర కారణాలతో వల్ల హైబీపీ వస్తుందన్నారు. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోయే పరిస్థితి ఉందన్నారు. ఉప్పు, కారం వంటి వాటి వినియోగం తగ్గించాలని, యోగ, ధ్యానం చేయాలన్నారు. అనంతరం బీపీ చెక్ చేయించుకోండి-ఆరోగ్యంగా జీవించండి అంటూ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ హసిత, ఎంపీహెచ్ఈఓ కె.అప్పారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన ఈఏపీసెట్



భీమవరం డీఎన్నార్ కళాశాలలో హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు రెండో రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 300 మందికి 267 హాజరుకాగా, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 350 మందికి 316 మంది హాజరయ్యారు. విష్ణు కళాశాలలో 200 మందికి 183 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని పరీక్షల పర్యవేక్షకులు ఎం.అంజన్‌కుమార్, ఎన్‌జీకే మూర్తి తెలిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



బస్సులో ఎగుమతి చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పూర్వ పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల సేల్స్ డిపో నుంచి అన్నిరకాల పుస్తకాల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. నాలుగు మండలాలకు పుస్తకాలను ఆర్టీసీ డిపో నుంచి బస్సుల్లో పంపిణీ చేస్తున్నారు. బుక్స్ డిపో మేనేజర్ టి.భాస్కరరావు, ఆర్టీసీ సూపర్‌వైజర్ డి.విజయకుమార్, కార్గో మేనేజర్ జి.మాధవరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూముల వద్దకు అనుమతి లేని ఏ ఒక్కరికీ ప్రవేశం లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం భీమవరం విష్ణు కాలేజీలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూములను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి భద్రతా అధికారులతో సమీక్షించి సూచనలు జారీ చేశారు. పరిశీలన అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సందర్శకుల పుస్తకంలో ఆయన సంతకం చేశారు. భద్రతా అధికారులతో మాట్లాడుతూ ఏ ఒక్కరినీ స్ట్రాంగ్‌రూమ్‌ల ప్రదేశానికి అనుమతించవద్దని, ఐడీ కార్డులు కలిగిన వ్యక్తులను పూర్తిగా తనిఖీ చేసిన మీదటే అనుమతించాల్సి ఉంటుందన్నారు. ఎవరూ సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లరాదన్నారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు సెగ్మెంట్లకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను విష్ణు కాలేజీలో, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం సెగ్మెంట్లకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లను ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, పోలీస్ అధికారులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బ్యాలెట్ బాక్సుల తరలింపు

భీమవరం (ప్రకాశంచౌక్): నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సులను పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతిష్ట భద్రత మధ్య భీమవరం విష్ణు కాలేజీ స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించినట్టు నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్థానిక భీమవరం కలెక్టరేట్ స్ట్రాంగ్ రూమ్‌లోని పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సులను శుక్రవారం మధ్యాహ్నం పటిష్ట బందోబస్తు మధ్య భీమవరం విష్ణు కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌నకు తరలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో బ్యాలెట్ బాక్సులను ఉంచి సీల్ చేశారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌ను 13,347 మంది, హోమ్ ఓటింగ్‌ను 1,089 మంది మొత్తంగా 14,433 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎన్నికల డీటీ ఎం.సన్యాసిరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మేడిది జాన్సన్, ఆర్‌వీ ప్రసాద్ (వైఎస్సార్‌సీపీ), మరపట్ల శ్యాంబాబు (టీడీపీ), తమలంపూడి వంశీ శ్రీనివాస్‌రావు, నల్లిమిల్లి అబ్రహం (కాంగ్రెస్), స్వతంత్ర అభ్యర్థులు కాకర రాజ్‌కుమార్, అద్దంకి దొరబాబు, తోలేటి రామ దుర్గాప్రసాద్, మేడపా వెంకట వరహాలరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల అధికారితో సమీక్ష

రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం కౌంటింగ్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల హాజరయ్యారు.

సీఎం జగన్ అధికారంలోకి రావడం ఖాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా అధికారంలోకి రావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే నౌషాద్ మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పోలింగ్ శాతం పెరగడానికి ప్రధాన కారణం ప్రభుత్వ వ్యతిరేకత కాదన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో ప్రజలకు రూ.2.70 లక్షల కోట్లను ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో అందించిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా సీఎం జగన్ చేసి చూపించారన్నారు. మహిళలు, వృద్ధులు, యువత జగన్‌ను నమ్మి ఓటు వేశారని, వైఎస్సార్ సీపీ రెండోసారి విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసి సీఎం జగన్ ప్రజల విశ్వాసాన్ని పొందారన్నారు.

ఘనంగా అతిరాత్ర మహాయాగం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని డీఎన్నార్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అతిరాత్ర మహాయాగంలో భాగంగా మూడోరోజు 96 మంది రుత్వికుల వేదఘోష్టితో ప్రాంగణమంతా మార్మోగింది. యాగాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన, అశ్వ పరిణయనం ప్రదక్షిణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ వేద పండితులు క్రతువులో పాల్గొన్నారు.

ఆనందప్రకాష్‌కు 41 నోటీసు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని యాళ్లవానిగరువులో నివాసముంటున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్‌కి శుక్రవారం పట్టణ పోలీసులు 41 నోటీసు అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొనకపోయినా, పాత వీడియోలు, పాత ఫొటోలు పెట్టి విశాఖకు చెందిన ఓ మహిళ సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయడం విచారకరమన్నారు. దీనిపై తాను ఎన్నికల్లో పాల్గొనలేదని లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు. ఫిర్యాదుపై పోలీసులు కనీసం విచారణ చేయకుండా కేసు నమోదు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఇదిలా ఉండగా 41 నోటీసు అందించే విషయంలో పాలకొల్లు పట్టణ సీఐ మంగాదేవి ఏకవచనంతో, అమర్యాదగా మాట్లాడారని ఆనందప్రకాష్ అన్నారు.



ఆనందప్రకాష్‌కు నోటీసు అందిస్తున్న పోలీసులు

నోటీసు స్వీకరించకపోతే ఇబ్బంది పడతారని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఫోన్‌లో బెదిరించారన్నారు. సీఐ మంగాదేవి నియంతృత్వ పోకడపై డీజీపీకి ఫిర్యాదు చేస్తానని, 41 నోటీసు జారీ చేసిన పోలీసు అధికారులు, రిటర్నింగ్ అధికారులపై న్యాయ పోరాటం చేస్తానని అన్నారు.

పిల్లలను బడుల్లో చేర్పించాలి

అత్తిలి: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో నమోదు చేయించి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు అందేలా చూడాలని జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ అన్నారు. అత్తిలి శివారు రామన్నపేటలో శుక్రవారం చేపట్టిన దివ్యాంగుల పిల్లల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు సమీపంలోని భవిత కేంద్రంలో పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు. పిల్లలు లోపాన్ని అధిగమించడానికి కావాల్సిన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు ప్రత్యేక విద్యను అందిస్తున్నారన్నారు. ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, ఉపకరణాలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ పరీక్షలు, ఉద్యోగాల్లో రాయితీలు వర్తిస్తాయన్నారు. సమగ్ర శిక్ష ద్వారా అలవెన్సులు కూడా అందిస్తున్నామన్నారు. జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, టి.శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు యేసు రాజు, కేఎస్ రమ్య పాల్గొన్నారు.



దివ్యాంగ పిల్లల నమోదు కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ శ్యాంసుందర్

మామిడి.. దిగుబడి తడబడి

- తగ్గిన దిగుబడులు
- మందకొడిగా ఎగుమతులు
- జిల్లాలో 15 వేల హెక్టార్లలో సాగు

చింతలపూడి: ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం సాగించే మామిడి పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మామిడి ఎగుమతుల్లో జిల్లాలో నూజివీడు తర్వాత ద్వితీయ స్థానం ఆక్రమించిన చింతలపూడి ప్రాంతంలో ప్రస్తుతం వ్యాపారం మందగించింది. సీజన్ ప్రారంభమై నెల కావస్తున్నా ఆశించిన స్థాయిలో ఎగుమతులు లేక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాయ దిగుబడి లేకపోవడం, కోతకు వచ్చిన కొద్దిపాటి కాయ నాణ్యత లోపించడం ఎగుమతులు మందగించడానికి కారణాలని వ్యాపారులు భావిస్తున్నారు. అలాగే కాయను ఆకర్షణీయమైన సైజుకు ఎదిగే వరకూ చెట్టుమీదే ఆపడానికి రైతులకు ధైర్యం చాలడం లేదు. అకస్మాత్తుగా ఈదురుగాలులు, వర్షాలు వస్తే మరింత నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు.

5 వేల టన్నులు మాత్రమే.. గతంలో ఏప్రిల్, మే నెలల్లో రోజుకు 25 లారీల మామిడి కాయలు ఎగుమతి చేసేవారు. రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో ఎగుమతి చేయలేక పోయామని వ్యాపారులు వాపోతున్నారు. ఏటా 20 వేల టన్నుల మామిడి పంట ఈ ప్రాంతం నుంచి కోల్‌కతా, నాగపూర్, గుజరాత్, హైదరాబాద్, పూనే, అహ్మదాబాద్, ఢిల్లీ, కాన్పూర్, ఒడిసా ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. ఈ ఏడాది సీజన్ ముగింపు దశకు వచ్చినా 5 వేల టన్నులు కూడా ఎగుమతి చేయలేదని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం బంగినపల్లి రకం టన్ను మామిడి కాయలు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతోంది.

జిల్లాలో తగ్గిన విస్తీర్ణం

గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో లక్షలాది ఎకరాల్లో విస్తరించి ఉండే మామిడి తోటలు ప్రస్తుతం బాగా తగ్గిపోయాయి. అధిక భాగం మామిడి తోటలను తొలగించి రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 44 వేల హెక్టార్లలో మామిడి స్థానంలో ఆయిల్‌పామ్ సాగవుతోంది. జిల్లాలో చింతలపూడి, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, ద్వారకాతిరుమల, నల్లజర్ల, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట ప్రాంతాల్లో సుమారు 15 వేల హెక్టార్లలో మాత్రమే మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి తోటల అభివృద్ధికి ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తోంది. రైతులకు మరింత ప్రోత్సాహం అందించి అవగాహన కల్పించకపోతే భవిష్యత్తులో మామిడి అంతరించి పోయే ప్రమాదం ఉంది.




బంగినపల్లి మామిడి కాయలను లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం



చింతలపూడి మార్కెట్‌లో మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు


దిగుబడి తగ్గింది



దిగుబడి తగ్గిన కారణంగా ఎగుమతులు మందగించాయి. ప్రారంభంలో టన్ను రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉన్న ధర ప్రస్తుతం రూ.30 వేలు పలుకుతోంది. ప్రభుత్వం మామిడి రైతులను, వ్యాపారులను ప్రోత్సహించేలా శీతల గిడ్డంగులను నిర్మించాలి.

– చిక్కాల సుధాకర్, మామిడి కమీషన్ వ్యాపారి, చింతలపూడి

రవాణా ఖర్చుల భారం



రైతుల నుంచి కొనుగోలు చేసిన మామిడి కాయలను రవాణా చేయడం భారంగా మారింది. మామిడి కాయల ప్యాకింగ్‌కు టన్నుకు రూ.1,500 వరకు ఖర్చవుతోంది. ఈ ఏడాది తోటలు సరిగా కాయకపోవడంతో 30 శాతం దిగుబడి మాత్రమే వచ్చింది.

– పసుపులేటి నాగరాజు, మామిడి వ్యాపారి

నేటి నుంచి ఉగాది నాటిక, నృత్యోత్సవాలు



మాట్లాడుతున్న బుద్దాల వెంకట రామారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో శనివారం నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు, నృత్యోత్సవాలను నిర్వహించనున్నట్టు బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాంస్కృతిక శాఖ, భారత ప్రభుత్వం (న్యూఢిల్లీ) ఆర్థిక సహకారంతో భారతీయ విద్యాభవన్స్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సౌజన్యంతో స్వర్గీయ గుండుమోగుల కృష్ణారావు, ఆదిలక్ష్మి స్మారక 31వ జాతీయస్థాయి ఉగాది నాటికల పోటీలు, నృత్యోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. 18, 19 తేదీల్లో ఉదయం 9 గంటలకు నృత్య పోటీలు నిర్వహిస్తారన్నారు. రాత్రి 7 గంటలకు నృత్య ప్రదర్శనలు, అవార్డుల ప్రదానం ఉంటాయన్నారు. 20న రాత్రి 7 గంటలకు రైతే రాజు, కౌసల్యా సుప్రజా రామా నాటికలు, 21న రాత, అమృతహస్తం నాటికలు, 22న స్వప్నం రాల్చిన అమృతం, నిశ్శబ్దమా నీ ఖరీదెంత, కొత్తరకం కొడుకు నాటికల నిర్వహణ, గౌరవ విశిష్ట సేవా పురస్కారాలు అందజేస్తారు. 23న ఇంద్రప్రస్థం, థింక్ నాటికలతో పాటు గౌరవ విశిష్ట సేవా పురస్కారాల ప్రదానం, 24న మాకూ స్వాతంత్ర్యం కావాలి, సీతా పరిత్యాగం నాటిక పోటీలతో పాటు జీవన సాఫల్య పురస్కార ప్రదానం, 25న రాత్రి ఘంటసాల నాటక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు శిక్షణ



నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు అవగాహన కల్పిస్తున్న క్యాంప్ కమాండెంట్ కల్నల్ బలేందర్‌సింగ్

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్‌ఐటీ ఆవరణలో ఆంధ్రా 4(ఏ) ఎన్‌సీసీ విజయవాడ బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరం శుక్రవారం రెండో రోజుకు చేరింది. జిల్లా నుంచి ఆరు కళాశాలలు, 14 పాఠశాలలకు చెందిన 723 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. దీనిలో భాగంగా ప్రతిరోజూ రెండు పూటలా డ్రిల్ నిర్వహించడంతో పాటు నాయకత్వ లక్షణాల పెంపుదల, రైఫిల్ డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఆప్టికల్ ట్రైనింగ్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, స్వీయ రక్షణ, యోగ, ఎన్‌డీఆర్‌ఎఫ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 25 వరకు శిబిరం కొనసాగుతుంది. క్యాంప్ కమాండెంట్ కల్నల్ బలేందర్‌సింగ్ ఆధ్వర్యంలో క్యాడెట్‌లకు పటిష్ట శిక్షణ నిర్వహిస్తున్నారు. ఇందులో క్యాంప్ ఆఫీసర్ మేజర్ స్వాతీపాండే, సుబేదార్ మేజర్ రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపిక



భరత్ రాయ్

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంకు చెందిన 6వ తరగతి విద్యార్థి భరత్ రాయ్ అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల బాపట్లలో నిర్వహించిన కరాటే జాతీయస్థాయి పోటీల్లో భరత్ రాయ్ ప్రతిభ చూపి.. నేపాల్‌లో జరిగే కరాటే పోటీలకు ఎంపికయ్యాడని తండ్రి దేవరపల్లి వేణు తెలిపారు. విద్యార్థిని పీఎస్‌ఎస్ అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య, చిట్నేని శివరామకృష్ణ, కోచ్ జాస్తి విద్యాధర్ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ



వేగవరంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో ఇద్దరు రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరును చోరీచేశారు. రైతులు నల్లగోపు శ్రీనివాస్, కొయ్య గంగాధరరావులు శుక్రవారం ఉదయం తమ పొలాలకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేసినట్లు గుర్తించారు. చోరీ విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. ఇటీవల మండలంలో రైతుల పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, దొంగతనాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జనం చెంతకే గిరిజన ఉత్పత్తులు

- మొబైల్ సేవల ద్వారా విక్రయాలకు శ్రీకారం
- ప్రకృతి సిద్ధ అటవీ ఉత్పత్తులకు మంచి గిరాకీ
- 2023 -24 ఆర్థిక సంవత్సరానికి రూ.94 కోట్ల అమ్మకాలు టార్గెట్
- ఇంతవరకు రూ.86 కోట్ల అమ్మకాలు



కుంకుడుకాయలు



జీసీసీ ద్వారా విక్రయిస్తున్న షాంపూలు



తేనె, అరకు కాఫీ

బుట్టాయగూడెం: అటవీ ప్రాంతంలో గిరిజనులు సేకరించిన సహజ సిద్ధమైన అటవీ ఉత్పత్తులను ప్రజల చెంతకు చేర్చేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ప్రత్యేకంగా కృషి చేస్తుంది. అడవుల్లో గిరిజనులు సేకరించిన ముడి సరుకులను జీసీసీ అధికారులు కొనుగోలు చేసి వాటి ద్వారా రకరకాల ఉత్పత్తులు తయారు చేస్తుంది. ఈ ఉత్పత్తులను జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన షాపుల్లో, మొబైల్ వ్యాన్, వారాంతపు సంతల్లో విక్రయిస్తున్నారు. రసాయనాలు లేని ఉత్పత్తులు కావడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువ శాతం ఆసక్తి చూపుతున్నారు. గిరిజన ఉత్పత్తులకు దేశ వ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. ప్రధానంగా అరకు వ్యాలీ కాఫీతో పాటు గిరిజన తేనె, త్రిఫల పౌడర్, ఆయిల్, గిరిజన సబ్బులకు మంచి గిరాకీ ఉంది. గిరిజన సహకార సంస్థ రంపచోడవరం డివిజన్ పరిధిలో 5 జీసీసీ సొసైటీ గిరిజన ఉత్పత్తుల అమ్మకాలు ఎక్కువగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అటవీ ఉత్పత్తుల విక్రయాలు ఇలా

అటవీ ప్రాంతం నుంచి గిరిపుత్రులు సేకరించిన చింతపండు, పుట్టతేనె, చెట్ల తేనె, నరమామిడి చెక్క, కరక్కాయలు, నల్ల జీడిగింజలు, ముసిడి గింజలు, అడవి ఉసిరి కాయలు, శీకాయలు, కుంకుడు కాయలు వివిధ రకాల పండ్లు ఇలా 30 రకాల వరకూ చిన్న తరహా ఉత్పత్తులు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) సేకరిస్తుంది. రాష్ట్రంలో 26 గిరిజన సహకార సంస్థలు (జీసీసీ), 9 డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా సేకరించిన ఉత్పత్తులను 70 కేంద్రాల్లో నిల్వ ఉంచుతారు.

రంపచోడవరం డివిజన్ పరిధిలో రూ.85 కోట్ల అమ్మకాలు

గిరిజన సహకార సంస్థ రంపచోడవరం డివిజన్ పరిధిలోని కోటరామచంద్రపురం (కేఆర్‌పురం), అడ్డతీగల, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, రంపచోడవరం డివిజన్ పరిధిలో సుమారు 129 జీసీసీ డిపోలు ఉన్నాయి. వీటిలో 2023 -24 ఆర్థిక సంవత్సరానికి రూ.94 కోట్లు అమ్మకాలు టార్గెట్ కాగా 2024 మార్చి వరకూ సుమారు రూ.86 కోట్ల అమ్మకాలు జరిగినట్లు జీసీసీ అధికారులు తెలిపారు. మిగిలిన టార్గెట్ మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

ప్రజల చెంతకు జీసీసీ ఉత్పత్తులు



జీసీసీ ద్వారా విక్రయిస్తున్న ఉత్పత్తులను ప్రజల చెంతకు చేరేలా కృషి చేస్తున్నాం. రంపచోడవరం పరిధిలోని 129 డిపోల్లో విక్రయాలు చేస్తున్నారు. గిరిజన ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. ఈ ఏడాది సుమారు రూ.86 కోట్ల వరకూ గిరిజన ఉత్పత్తుల అమ్మకాలు జరిగాయి.

– జి.పార్వతీశ్వరరావు, కేఆర్‌పురం జీసీసీ ఇన్‌చార్జి, జీసీసీ డీఎం, రంపచోడవరం

తిరుమలాపురంలో చేపల చెరువు వివాదం



తిరుమలాపురంలో ఇరువర్గాలతో చర్చిస్తున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం పంచాయతీలోని తామర చెరువు వద్ద గిరిజనులు, చేపల పాటదారులు మధ్య వివాదం తలెత్తింది. తామరచెరువులో ఏటా పంచాయతీ ద్వారా చేపలు పట్టేందుకు వేలం నిర్వహిస్తుంటారు. స్థానికులు ఈ చెరువును వేలంలో రూ.2 లక్షలకు దక్కించుకున్నారు. కొద్ది రోజులు క్రితం కొంతమంది గిరిజనులు చేపలను పట్టుకుంటామని స్థానికులకు చెప్పి వెళ్లిపోయారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుబ్బలక్ష్మి జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో గిరిజనులు వలలతో చెరువు వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పాటదారులు, స్థానికులు చెరువు వద్దకు చేరుకుని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. సీఐ రాజేష్, ఎస్సై జ్యోతిబాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించి నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

నేడు వరుడిగా చినవెంకన్న ముస్తాబు



ఆలయ ప్రధాన కూడలిలో స్వామి, అమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్



విద్యుత్ కాంతులతో శ్రీవారి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం

ద్వారకాతిరుమల: చినవెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు ఈనెల 25తో ముగియనున్నాయి. అందులో భాగంగా ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ రాజగోపురాల సముదాయం, అనివెట్టి మండపం తదితర ప్రాంతాలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఆలయ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన స్వామివారి భారీ విద్యుత్ కటౌట్ చూపరులను ఆకట్టుకుంటోంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లను నిర్మించారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి వేళల్లో నిర్వహించే శ్రీవారి తిరువీధి సేవలకు స్వామివారి వాహనాలను ముస్తాబు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికను సుందరీకరించారు. శనివారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. ఈ ఉత్సవాలు ముగిసే వరకు స్వామివారు ఆలయ ముఖ మండపంలో రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి – భజన కార్యక్రమాలు
- ఉదయం 8 నుంచి – అన్నమాచార్య కీర్తనలు
- ఉదయం 8.30 నుంచి – శ్రీవారిని పెండ్లికుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకారం
- ఉదయం 9 నుంచి – హరికథ
- ఉదయం 11 నుంచి – భక్తిరంజని
- సాయంత్రం 4 నుంచి – నాదస్వరకచేరి
- సాయంత్రం 5 నుంచి – కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 నుంచి – గజ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- రాత్రి 8 నుంచి – నాటకం



శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

- శ్రీవారి ప్రత్యేక అలంకారం : శ్రీ భూసమేత మహావిష్ణువు

కొంతేరులో నాటిక పోటీలు ప్రారంభం



కౌసల్యా సుప్రజా రామా నాటికలోని దృశ్యం

యలమంచిలి: సమాజంలోని రుగ్మతలను వేలెత్తి చూపడంలో నేటికీ నాటికలు కీలకపాత్ర పోషిస్తున్నాయని కొంతేరు యూత్ క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ చెప్పారు. కొంతేరు గ్రామంలోని పుల పర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో 42వ జాతీయ స్థాయి నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభకు మురళీకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రారంభ సభలో చేగొండి సత్యనారాయణమూర్తి, కొంతేటి సర్వేశలింగం, గుండా రామకృష్ణ, ఉన్నమట్ల కబర్ధి, గోడి మోహనరావు తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు నాటిక ప్రాంగణానికి కొంతేరు మాజీ సర్పంచ్ ముదునూరి నరసింహరాజు పేరు పెట్టారు. తొలి ప్రదర్శనగా కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ వారిచే కౌసల్యా..సుప్రజా..రామా..! నాటిక ప్రదర్శించారు. రామాయణంలో రాముడు అరణ్యానికి వెళ్తుంటే భర్త దశరథుడి మీద గౌరవంతో కుమారుడి అరణ్య ప్రయాణాన్ని కౌసల్య ఎలా అడ్డుకోలేక పోయిందో కలియుగంలో కూడా ఉద్యోగాల పేరిట విదేశాలకు వెళ్తున్న పిల్లలను అడ్డుకోలేకపోతున్నారనే ఇతివృత్తంతో నాటిక సాగింది. స్నిగ్ధ రచించిన ఈ నాటకానికి గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. రెండవ నాటికగా చిలకలూరిపేట సుకృతి క్రియేషన్స్ వారిచే మిణుగురు వెలుగులు నాటిక ప్రదర్శించారు. కె.ఆదిత్య రచించిన ఈ నాటకానికి కెవి మంగారావు దర్శకత్వం వహించారు. ప్రేమ ఫలించలేదని పిల్లలు ఆత్మహత్యలు చేసుకుని సమాధుల పాలయితే బతికి ఉండగానే ఆ తల్లిదండ్రుల కడుపు కోత ఎలాంటిదో ఈ నాటిక కళ్లకు కట్టింది.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.ఓంప్రకాష్, రమణారావు

భీమవరం: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్–1938 జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక పీఎస్ఎం గరల్స్ హైస్కూల్, భీమవరంలో గురువారం సాయంత్రం జరిగాయి. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.ఓంప్రకాష్, పీవీఎస్ఎస్‌బీ రమణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కె. బాబాజీ సాహెబ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా బి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా వి.శ్రీవల్లి, పి.రాజేశ్వరరావు, బి.ఆదినారాయణ, అదనపు కార్యదర్శిగా కె.గంగరాజు, కార్యదర్శులుగా ఎ.ఎస్.వి సుభాషిణి, డి.అంజనీదేవి, ఎస్.ఆంజనేయులు, పి.గంగాకుమారి, జె.సత్యనారాయణ, జి.శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.నాగరాజు, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా డి.తిరుమలేశ్వరి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ఉదయబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త కార్యవర్గం మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యా సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in May/June Cont: ✆ : 73383 76874 [R-451]

Wanted

■ Wanted Marketing Executives for ICIC Bank Loans Full / Part time Salary 10,000 + Incentives Call: 80965 55399 [P-779411]

■ ఏలూరులోని షాపింగ్ మాల్‌కి 5 సం. అనుభవం గల Male సెక్యూరిటీ సూ.వై, గార్డ్స్ (Only ఏలూరు వారు) కావలెను. జీ:16000/14000 + PF, ESI 12 గం.లు, డ్యూటీపై ఫ్రీ మీల్స్ ✆ 94412 39336 [B-755714]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. శాలరీ 15000 - 25000 వరకు కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217 [G-8878]

■ Wanted Hindi & Physics Teacher AYEM High School, Kambotlapalem, Call Tony 9949786028, Salary: Rs.10000 per Month. [C-800235]

■ మాకంపెనీ కొరకు 80మంది స్త్రీ,60మంది పురుషులు & టెలికాలర్స్ (F) అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+భోజనం +జీతం: 24,000/- వరకు. డైరెక్ట్ జాబ్, స్పాట్ జాయినింగ్. ఫోన్:7799087387 [HA-10856]

■ కన్సల్టెన్సీకాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+ భోజనం. HYD. 9014885406 [HA-131]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [HA-799881]

■ ఫిమేల్ హాస్టల్ ఇన్‌ఛార్జీలు కావలెను. జీతము: 10000/- నుండి 12000/- వరకు ఇవ్వబడును. భోజనం మరియు వసతి ఇవ్వబడును. మాస్టర్ మైండ్స్, 3/11, బ్రాడీపేట, గుంటూరు. ఫోన్ నెంబర్: 91000 24059 [G-5356]

■ R.K. ఇంజనీరింగ్ కాలేజి నందు పని చేయుటకు వంట మాస్టర్స్ కావలెను. మంచి జీతం+భోజనం + ఉచిత వసతి కల్పించబడును. సంప్ర॥ కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 9701473399 [G-37]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఓఎన్‌జీసీ పైపులైన్ నిర్మాణంలో ఉద్రిక్తత



పైపులైన్ నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామం నుంచి రుస్తుంబాద వరకూ చేపట్టిన ఓఎన్‌జీసీ పైప్‌లైన్ నిర్మాణ పనులను అడ్డుకున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నరసాపురం మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామంలోని ఓఎన్జీసీ రిగ్గు నుంచి రుస్తుంబాదలోని ఓఎన్జీసీ స్థావరం (యస్–4) వరకూ భూగర్భ నిల్వలను తరలించేందుకు పైపులైన్ నిర్మాణ పనులు రైతులు అడ్డుకోవడంతో గత కొన్నేళ్లుగా నిలిచిపోయాయి. ఈ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు పలుమార్లు ప్రయత్నించినా రుస్తుంబాదకు చెందిన పలువురు రైతులు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయాయి. తాజాగా శుక్రవారం అధికారులు పోలీసు, ఎస్పీఎఫ్, స్పెషల్‌పార్టీ బలగాల రక్షణతో నిర్మాణ పనులు చేపట్టే ప్రయత్నం చేసింది. అడ్డు వచ్చిన రైతులను పోలీసులు బస్సుల్లో భీమవరంలోని కలెక్టరేట్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమ పొలాల్లో గ్యాస్ పైపులైన్లు వేయడం వల్ల నష్టపోతామంటూ రైతులు వాపోయారు. రైతులతో జిల్లా కలెక్టర్ చర్చలు జరిపారు. తాత్కాలికంగా పనులు విరమించుకోవాలని ఓఎన్జీసీ అధికారులకు సూచించినట్లు నరసాపురం తహసీల్దార్ తెలిపారు. రైతులకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని సీపీయం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు.

శశి ఇంజినీరింగ్ కళాశాలకు అదనపు సీట్లు

తాడేపల్లిగూడెం : పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలకు అదనపు సీట్లు మంజూరు చేస్తూ ఏఐసీటీఇ నుంచి అనుమతి వచ్చినట్టు సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి కంప్యూటర్ సైన్సు విభాగంలో 180 సీట్లకు అదనంగా 60 సీట్లు, కంప్యూటర్ సైన్సు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు, మిషన్ లెర్నింగ్ విభాగంలో ప్రస్తుతమున్న 120 సీట్లకు అదనంగా 60 సీట్లు మంజూరయ్యాయన్నారు.

నేడు ప్రవీణ్ ప్రకాశ్ పర్యటన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ శనివారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లాలోని భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో, పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకులో వివిధ పాఠశాలలను సందర్శించనున్నారు. పాఠ్యపుస్తకాల వివరాలను స్టాక్‌పాయింట్‌లో పరిశీలిస్తారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేయగా మిగిలిన పాఠ్యపుస్తకాల వివరాలు, జగనన్న విద్యాకానుకలో మిగిలిన వస్తువుల వివరాలు తెలుసుకుంటారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మన బడి – నాడు నేడు పనుల ప్రగతి, ఐఎఫ్‌పీ ప్యానల్స్ పనితీరు, జగనన్న విద్యాకానుకకు కొత్త స్టాక్ వివరాలు, శానిటరీ న్యాప్‌కిన్లు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ బిళ్ళల పంపిణీ తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

నేడూ వర్షం పడే అవకాశం

ఏలూరు(మెట్రో) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. జిల్లా వ్యాప్తంగా ప్రజలు గత రెండు నెలలుగా ఎండ వేడిమితో అల్లాడిపోతున్న తరుణంలో ఉపశమనం లభించింది. ఎండాకాలంలో రెయిన్‌కోట్‌లు, గొడుగులు దర్శనమిచ్చాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో శనివారం కూడా వర్షం పడే అవకాశాలున్నాయి. వర్షం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించడంతో ఆ మేరకు రైతులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం 1.5 మి.మి వర్షం నమోదు కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉదయం నుంచి వర్షం

పోలవరం రూరల్: అల్పపీడనం ప్రభావంతో పోలవరం ప్రాంతంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో పడిన వర్షంతో ప్రజలు సేదతీరారు. రెండు రోజుల క్రితం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు జల్లులతో ఊపిరి పీల్చుకున్నారు.



పోలవరంలో ఈదురుగాలులతో వర్షం



పాలకొల్లులో పెదగోపురం వద్ద కురుస్తున్న వర్షం

పాలకొల్లులో జోరువాన

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో కురిసిన వర్షానికి జనం ఎక్కడికక్కడ స్తంభించారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో కురిసిన వర్షంతో పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండు ప్రాంతం వర్షం నీటితో నిండిపోయింది. అకాల వర్షంతో జనం ఇబ్బందులు పడ్డారు. గంటన్నర సేపు వర్షం కురిసింది. ఆటో స్టాండ్, హౌసింగ్‌బోర్డు కాలనీ, బ్రాడీపేట, శ్రీరాంపేట, బంగారు వారి చెరువుగట్టు వంటి అనేక పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.



ఏలూరులో వర్షంలో ప్రయాణం



ఏలూరులో కురుస్తున్న చిరుజల్లులు

క్లుప్తంగా

నేడు వాసవీ మాతకు పంచామృతాలతో అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవి మాత జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 18వ తేదీ శనివారం వాసవీ మాతకు 108 వెండి కలశములతో మూల విరాట్‌కు పంచామృతాలతో, పండ్ల రసాలతో సుగంధ ద్రవ్యాలతో, పసుపు, కుంకుమ, పాలతో విశేష అభిషేకాలు జరగనున్నాయి. బైక్ ర్యాలీలు, విశేష అలంకరణలు, మహిళలచే కుంకుమ పూజలు, వాసవి క్లబ్ వారిచే మహా అన్న ప్రసాదాలు అందించనున్నారు. భక్తులు హాజరు కావాలని ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ సభ్యులు కోరారు.

19 నుంచి వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 52 వసంతాల వేడుకలు సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఘనంగా జరుగుతాయని మందిర అభివృద్ధి కమిటీ చైర్మన్ కూనిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. వెంకటేశ్వరస్వామి కల్యాణంతో పాటు శ్రీరమ సహిత సత్యనారాయణ స్వామి కల్యాణం, హోమాలు, పుష్పోత్సవం, పవళింపు సేవలు, అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు హాజరై తిలకించాలని కోరారు.

సీనియర్ సిటిజన్స్‌కు ప్రయాణ రాయితీ ఇవ్వాలి

పాలకొల్లు సెంట్రల్: భారతీయ రైల్వే శాఖ సీనియర్ సిటిజన్స్‌కు గతంలో టికెట్ పై రాయితీ ఇచ్చేవారని ఈ రాయితీని కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా నిలిపివేసిందని పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంగా నరసింహారావు తెలిపారు. శుక్రవారం నరసింహారావు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్‌కు ఇచ్చే రాయితీపై ఒకసారి పునరాలోచన చేసి మళ్లీ పునరుద్దరణ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పాలకొల్లు రైల్వే స్టేషన్లో త్వరగా లిఫ్ట్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే రెవెన్యూ, మునిసిపల్, బ్యాంకులు ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్స్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు కుటుంబపరంగా వ్యక్తిగత సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని వంగా నరసింహారావు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు యర్రంశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వ్యవసాయపనులు అంతంత మాత్రంగా ఉండటంతో ఉపాధి కూలీలు, పంటబోదెల తవ్వకాలకు ప్రాధాన్యమిస్తున్నారు. మండలంలో భారీ మంచి నీటి చెరువులు ఉన్న ప్రాంతాలలో పూర్తి స్థాయిలో మంచినీటి చెరువులు తవ్వేందుకు పనులుచేపట్టారు. మొగల్తూరు, కేపీ పాలెంలోని పంటబోదెల నుంచి మంచినీటి చెరువులకు వెళ్ళే పనులు పూర్తికావచ్చాయి. శుక్రవారం కాళీపట్నం మంచి నీటి చెరువులోకి నీరు వెళ్లేందుకు కోమటి తిప్పలో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. దీంతో జేఈ ఆనంద్ కూలీల మస్టర్‌ను పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు.

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

మొగల్తూరు: మొగల్తూరు కడలివారి పాలెం నుంచి పెద్దపల్లవపాలెం వరకు నిర్మించేందుకు చేపట్టిన రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. నరసాపురం, సతారాంపురం , మొగల్తూరు మీదుగా జాతీయ రహదారి విస్తరించింది. దీనిలో భాగంగా మొగల్తూరు గ్రామంలోకి వెళ్లేందుకు స్థానిక ప్రధాన రహదారిని కూడా జాతీయ రహదారుల శాఖ విస్తరించాల్సి ఉంది. దీంతో మొగల్తూరులోని కడలివారిపాలెం నుంచి పాతకాలువ, రామాలయం సెంటర్, గాంధీ బొమ్మల సెంటర్, లాకు మీదుగా పెద్దపల్లవపాలెం వరకు రహదారి నిర్మించేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ రూ.10 కోట్లు మంజూరు చేసింది. దీంతో మొగల్తూరు ప్రధాన రహదారి నిర్మించేందుకు పనులు చేపట్టామని పనుల పూర్తయిన తరువాత రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖకు రహదారిని అప్పగించనున్నట్లు జాతీయ రహదారుల శాఖ డీఈ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆరోగ్యానికి వాకింగ్ మంచిదే

మారుతున్న జీవన శైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్ : ఆరోగ్యమే మహాభాగ్యం అన్నట్లుగా నగర ప్రజలు ప్రత్యామ్నయ వైద్యంగా వ్యాయామాన్ని ఆశ్రయిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. మారుతున్న జీవన శైలిలో ఆరోగ్యం కోసం వాకింగ్ (నడక) ఎంచుకున్నారనడంలో కూడా అతిశయోక్తి కాదేమో. ఆరోగ్యమే మహాభాగ్యం అనే పెద్దల మాటను నేడు నగర ప్రజలు అక్షర సత్యం పాటిస్తున్నారు. రోజుకు ఒక గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వానికి, మానశిక ఉల్లాసం కలుగుతుందని, ఆలోచనా సామర్ధ్యం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని నమ్మిన ఆరోగ్యాభిలాషులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో వీలైతే వ్యాయామ శాలలకు వెళ్లడం, యోగా, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనితో పట్టణంలోని క్రీడా మైదానాలు, జిమ్‌లు, ఉదయం, సాయంత్ర వేళల్లో కిటకిటలాడుతున్నాయి. మైదాన ప్రాంతాలతో పాటు వివిధ క్రీడా మైదానాలు, పార్కులలో గల వాకింగ్ ట్రాక్‌లపై వాకింగ్, జాగింగ్‌లు చేసేందుకు జనం తరలి వస్తున్నారు. వాకింగ్ చేసేందుకు వృద్ధులు, యువతీ, యువకులు సైతం ఆయా మైదానాల్లో వ్యాయామం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం వాకింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గతంలో రోజుకు 50 మంది నుంచి 70 వరకూ వాకింగ్ చేసే వారు ఇప్పుడు ఆసంఖ్య 150 నుంచి 200 వరకూ పెరిగిందని పేర్కొంటున్నారు. రోజుకు ఒక గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వానికి, మానశిక ఉల్లాసం కలుగుతుందని, ఆలోచనా సామర్ధ్యం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

అధిక బరువును తగ్గించుకునేందుకు...

ప్రస్తుతం జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా, ఆహారపు అలవాట్ల కారణంగా జనాబాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాదపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువతీ, యువకులు అధిక బరువు కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్‌లు వంటి జంక్ ఫుడ్స్‌ను అధికంగా తీసుకోవడం వలన ఈసమస్య వస్తుందని పేర్కొంటున్నారు. అధిక బరువుతో బాధపడుతున్న వారు వాకింగ్ ట్రాక్‌లలో పరుగులు తీస్తుండగా మరికొందరు గంటల తరబడి వ్యాయామశాలలో వ్యాయామాలు చేస్తున్నారు. మరికొందరు యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు ఇవీ

ప్రతీ రోజూ నడకతో బీపీ, సుగర్‌లను అదుపులో ఉంచుకోవచ్చు. గుండె జబ్బులు, కొలస్ట్రాల్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానశిక ఒత్తిడిని దూరం చేయవచ్చు. శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం ద్వారా వారిలో ఎదుగుదల, మానశిక పరిపక్వత, ఏకాగ్రత పెరుగుతుంది. మంచి ఆలోచనా శక్తి పెరుగుతుంది.

శ్రద్ధ పెరిగింది

కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి అంశాలలో ప్రజలలో అవగాహన స్థాయి పెరిగింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ ఎక్కువైంది. శరీర శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం వివిధ రకాల ఆటల పోటీలను, అవగాహనా సదస్సులను నిర్వహిస్తుంది.

సుగర్ నియంత్రణలో ఉంది



గత 20ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నాను. రోజూ సాయంత్రం సమయంలో 40 నిమిషాలపాటు నడక నడుస్తున్నాను. సుగర్ నియంత్రణలోనే ఉంది. బలహీనత అంటూ తెలియడంలేదు. ఆరోగ్యంగానే ఉంటున్నా.

– ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, రిటైర్డ్ టీచర్, తణుకు.

నిద్ర బాగా పడుతుంది



గత 30 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నా. ఉదయం, సాయంత్రం సమయంలో క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తున్నాను. వాకింగ్ చేయడంవల్ల శరీరంలో బలహీనతలు లేకుండా చేస్తుంది. నిద్ర బాగా పడుతుంది.

–పీ సూర్యనారాయణ, రిటైర్డ్ మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి

వాకింగ్ తప్పనిసరి



గుండెకు స్టంట్ వేసిన తర్వాత వాకింగ్ తప్పని సరైంది. గత 20 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నా. వాకింగ్ వలన శరీరంలో ఉండే నరాలన్నీ కదలడం వలన రక్త ప్రసరణ బాగుంటుంది. తద్వారా మనిషి శక్తిని పుంజుకుంటాడు.

– అజ్జరపు విశ్వన్న పంతులు, రిటైర్డ్ హెచ్ఎం, తణుకు

నడకతో మంచి ఆరోగ్యం



రోజుకు గంటన్నర నడకతో మంచి ఆరోగ్యంతో పాటు శీర ధారుడ్యం పెరిగింది. పది అడుగుల నడక రోగాలను దూరం చేస్తుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా శరీరంలో సుగర్, బీపీ పెరగకుండా ఉంచుతుంది. వైద్యులు కూడా నడవమని సలహాలిస్తున్నారు.

– ఉల్లంపర్తి సూర్యారావు, రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, తణుకు

ప్రశాంతంగా ఈఏపీ సెట్ పరీక్ష



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు గాను రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశ పరీక్ష ఈఏపీ సెట్ పరీక్షకు శుక్రవారం పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 220 మంది హాజరు కావాల్సి ఉండగా 203 మంది, సాయంత్రం పరీక్షకు 221 మందికి గాను 197 మంది హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్ , టీసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు

తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలోని పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి బందోబస్తు మధ్య శుక్రవారం భీమవరంలోని స్ట్రాంగ్ రూమ్ ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు పంపించారు. జూన్ నాలుగున జరిగే ఓట్ల లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ కూడా కలిపి లెక్కించడం జరుగుతుందని ఆర్ఓ కె.చెన్నయ్య తెలిపారు.

మేమంతా ఓటు వేయం..!

- నియోజకవర్గంలో 41,948 మంది ఓటుకు దూరం
- 2019లో సైతం దూరంగా 45,168 మంది ఓటర్లు
- గతంలో కంటే తగ్గిన 3,220 మంది ఓటర్లు



తణుకు మండలం దువ్వలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

తణుకు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో తణుకు నియోజకవర్గంలో వేలాది మంది ఓటుకు దూరమయ్యారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేక..? లేదా ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయో తెలియదు కానీ ఇక్కడ పోలింగ్ శాతం తగ్గినట్లు తెలుస్తోంది. పారిశ్రామిక ప్రాంతం తణుకు నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ శాతం పట్ల అటు రాజకీయపక్షాలు, ఇటు పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతి సారి ఎన్నికల్లో 40 వేలకు పైగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోకపోవడం మాత్రం చర్చనీయాంశమవుతోంది. ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు సాధారణ ఎన్నికల సమయంలో తమ సొంతూళ్లకు వెళ్లిపోతున్నాయా, లేనిపక్షంలో ఓటింగ్‌లో పాల్గొనడం ఇష్టం లేదా వంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో 80.54 శాతం, 2024లో జరిగిన ఎన్నికల్లో 82.12 శాతం ఓట్లు పోలయ్యాయి.

భారీగానే ఓటుకు దూరం...

నియోజకవర్గంలో జరిగిన అన్ని ఎన్నికల్లోను భారీ సంఖ్యలోనే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోని పరిస్థితి కనిపిస్తోంది. 2,34,575 మంది ఓటర్లు ఉన్న తణుకులో 41,948 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2019లో సైతం 2,32,126 మంది ఓటర్లకు గాను 45,168 మంది ఓటింగ్‌కు దూరమయ్యారు. ఇంతపెద్ద సంఖ్యలో ఓటర్లు ఓటు వేయకపోవడం ప్రజాస్వామ్యవాదులను కలవరపరుస్తోంది. ఓటు రాకపోతే సంబంధిత సిబ్బందిపై శివాలెత్తిపోతున్న దరఖాస్తుదారులు ఓటు వచ్చిన తర్వాత దాన్ని వినియోగించుకోవడంపై శ్రద్ధ చూపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2019 ఎన్నికల నాటికి తణుకు ఓటర్ల సంఖ్య 2,32,126 మంది కాగా, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2,34,575కు పెరిగింది. గత ఎన్నికలకంటే ఈసారి 3,220 మంది తగ్గారు. ఓటింగ్ కూడా గత ఎన్నికల కంటే ఈసారి మెరుగు పడినప్పటికీ అయినా ఓటును వినియోగించుకోని ఓటర్లు పెరిగారు. ఈ పరిస్థితి రాజకీయ పరిశీలకులను విస్మయానికి గురి చేస్తోంది.

ఎందుకిలా...?

వేలాది మంది ఓటింగ్‌కు దూరమైపోతుండటంపై పరిశీలకులు వివిధ రకాలుగా విశ్లేషిస్తున్నారు. పారిశ్రామిక కేంద్రంగా ఉన్న తణుకు ప్రాంతానికి ఉమ్మడి జిల్లాల్లోని పలు ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి కూడా వలస వచ్చి నివాసముంటున్నవారు కూడా అధికంగానే ఉన్నారు. అయినప్పటికీ వారి మూలాలు తమ సొంత ప్రాంతాల్లోనే ఉండటంతో ఇలాంటి సందర్భాలు వచ్చినప్పుడు అక్కడికి వెళ్లిపోతున్నట్టుగా పేర్కొంటున్నారు. ఈ విధంగా ఈసారి కూడా తణుకు ప్రాంతం నుంచి సుమారు 20 శాతం మంది ఓటర్లు తమ సొంత గ్రామాలకు వెళ్లి పోయినట్టుగా భావిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికలు పలు పార్టీలకు ప్రతిష్టాత్మకం కావడంతో ఆయా ప్రాంతాల్లోని అభ్యర్థులు ఎక్కడెక్కడ ఉన్నా తమ గ్రామస్తులను, పరిచయస్తులను కూడా తమకు ఓటు వేసేందుకు పిలిపించుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తణుకులో 40 వేల మంది ఓటర్లు ఇక్కడ ఓటింగ్‌లో పాల్గొనడం లేదని అభిప్రాయ పడుతున్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి



తణుకులో పరిసరాల పరిశుభ్రతపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు ప్రతి ఒక్కరూ వారానికోసారి ఫ్రైడేను డ్రైడేగా పాటించి నీటి నిల్వలు, పరిసరాల్లో ఉన్న అవసరంలేని సామాగ్రిని తొలగించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని పెరవలి రోడ్డు, చాకలిచెర్వు ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమల నివాసాలుగా ఉండే రుబ్బురోళ్లు, రెఫ్రిజిరేటర్స్, ఎయిర్ కూలర్స్ వంటి వాటిని వారానికోసారి శుభ్రం చేసుకోవాలని, పాడైన టైర్లు, తాగిపారేసిన కొబ్బరి బొండాలను దూరంగా తొలగించేందుకు కృషి చేయాలన్నారు. దోమల వ్యాప్తిని నిరోధిస్తే వ్యాధులు దరిచేరవనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు మాధవి, భానుశ్రీ, ఆశ కార్యకర్త లలిత పాల్గొన్నారు.

వైభవంగా బలుసులమ్మ జాతర



పడాల గ్రామంలోని బలుసులమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో శ్రీబలుసులమ్మ వారి సేవ, జాతర సంబరం శుక్రవారం మూడవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రతి రూపమైన ఘటాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి పొన్నులు ఏర్పాటు చేసి, మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఘటాలు గ్రామంలో ఏర్పాటు చేసిన పూరిగుడిసె వద్దకు చేరుకున్నాయి. ఆలయ కమిటి ప్రతినిధులు పచ్చా రామారావు మాట్లాడుతూ బలుసులమ్మ వారికి 120 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. 60 ఏళ్ల క్రితం అమ్మవారికి జాతర జరిగిందని, తిరిగి 65 ఏళ్ల అనంతరం నేడు జరుగుతుందన్నారు. దాదాపు రూ.30లక్షలు వెచ్చించి జాతర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం అన్నసమారాధన, ఆదివారం అమ్మవారికి భక్తులు నివేదనలు సమర్పిస్తారన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పిచ్చికల రామకృష్ణ, పులి సూర్యప్రసాద్, గంధం ప్రసాద్, పచ్చా రత్నరావు, కొత్త వెంకటేశ్వరరావు, కొత్త అంజిబాబు, సురేష్, మానే అంజి, కామిశెట్టి కుమారస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటుపై అవగాహన



అధిక రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న అడ్డాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజల్లో ఎక్కువశాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లు ఆరోగ్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం లంకలకోడేరు -2 సచివాలయం, అలాగే అరట్లకట్ట గ్రామ సచివాలయం, అరట్లకట్ట కమ్ము ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో 30 సంవత్సరాలు దాటినవారికి బీపీ పరీక్షలు నిర్వహించి అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు అందజేసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఆహారంలో ఉప్పు శాతం పెరగడం వల్ల అధిక రక్తపోటు పెరుగుతుందని, దీనివలన గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. భుజించే ఆహారంలో మసాలాలతో పాటు ఆల్కహాల్, ధూమపానం చేయడం వల్ల రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడి అధిక రక్తపోటు పెరుగుతుందన్నారు. రక్తంలో కొవ్వు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగ చేయడం వల్ల బీపీ తగ్గించుకోవచ్చన్నారు. బీపీ ఉన్న రోజులు మందులు సక్రమంగా వాడకపోతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సులో డా. ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, ఫార్మాసిస్టు పీవీ స్వామి, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమేశ్వరరావు, జి.ఉదయ్‌చంద్ర, డి.కమల పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేవు. సరిగ్గా మలుపులో గొయ్యి ఉండటంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పల్లపుప్రాంతం కావడంతో వర్షం వస్తే రెండు, మూడు గంటలు వరకూ నీరు నిల్వ ఉండిపోతుంది. ఆ సమయంలో అక్కడ గొయ్యి ఉందనే సంగతి కూడా తెలియదు. నిత్యం వందల మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. మునిసిపాలిటీ మాత్రం ఈ డ్రెయిన్ అభివృద్ధి విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ అంశంపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తిరు కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవంలో భాగంగా సాయంత్రం 6 గంటలకు మంగళ వాయిద్యాలు నడుమ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ధ్వజారోహణ సందర్భంగా సంతానం లేని దంపతులు సంతానం కోసం శ్రీ స్వామివారి గరుడ పొంగలి విశేష ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మాధవరం గ్రామంలో వీర్రాజు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం పని ముగించుకుని ఇంటికి వెళ్తూ గుండెపోటుకు గురై కూలీ మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రొట్టె వీర్రాజు (63) స్థానికంగా ఉన్న మేజర్ కెనాల్‌లో ఉపాధి పనులు చేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సందర్భంలో గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయాడు. దీంతో అతను మృతి చెందాడు. ఉపాధి హామీ పథకం ఇన్‌ఛార్జ్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్. మంగరాజు మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతునికి ఒక కుమారుడు, ఇరువురు కుమార్తెలు కలరు. ప్రస్తుతం కుమారుడు సత్యమూర్తి ఇంటి వద్ద ఉంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తణుకు: తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామానికి చెందిన అడ్డాల నర్సింహారావు ఇంటింటికీ మోపెడ్‌పై తిరిగి అపరాలు విక్రయిస్తుంటారు. శుక్రవారం ఉదయం తణుకు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తుండగా వేగంగా వచ్చిన స్పోర్ట్స్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోపెడ్‌పై వెళుతున్న నర్సింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుణ్ని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణీల సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. శుక్రవా రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో అందిస్తున్న కార్గో సేవలు, కార్గో డోర్ డెలివరీ సేవలు, విద్యార్థుల రాయితీ, ప్రత్యేక బస్సులు తదితర అంశాలపై ఫిర్యాదులు, సూచనలు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. నరసాపురం డిపో పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, మార్టేరు, పెనుగొండ, ఆచంట చుట్టు ప్రక్కల ప్రాతాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమస్యలు ఉన్నవారు 99592 25486 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నరసాపురంలో భారీ వర్షం

నరసాపురం: పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి భారీ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం 10 గంటలు నుంచి గంటపాటు తెరిపిలేకుండా వర్షం పడింది. తరువాత సాయంత్రం వరకూ కూడా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కొన్ని రోజులుగా ఎండవేడిమితో అల్లాడుతున్న జనానికి ఈ రెండు రోజుల నుంచికురుస్తున్న వర్షం ఉపసమనాన్ని ఇచ్చింది. తీరంలో అకాలవర్షాలకు మామి డి, ఉప్పు రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

పోడూరు: బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుమ్మలూరు గ్రామంలో విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. గ్రామంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 270 మంది విద్యార్థులకు కంప్యూటర్ పై ప్రాథమిక అవగాహన, గణితంలో మెలుకువ పై ఉచితంగా శిక్షణను ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ జీవీఎస్ఎస్ రవి ఆనంద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

